నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

- 82.97 శాతం మంది హాజరు

-కేంద్రాలను పర్యవేక్షించిన ఎస్పి

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో రాయచోటి 4, మదనపల్లి 5, పీలేరు 1, రాజంపేట 2, కురుబలకోట 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7,425 మంది పరీక్షకు హాజరు కావాల్సింది ఉండగా 6,161 మంది పరీక్షకు హాజరయ్యారు. 82.97 శాతం హాజరయ్యారు.అందులో భాగంగా పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, సాయి హై స్కూల్, రాజు హై స్కూల్, శ్రీ దేవపట్ల హరినాథరెడ్డి డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాయచోటిలో 1960 మంది అభ్యర్థులు ఉండగా 1678 మంది పరీక్షకు హాజరు అయ్యారు. 282 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

పీలేరు : పరీక్షకు హాజరైన అభ్యర్థులు

రాయచోటి : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పి బి. కృష్ణారావు

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పి

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను ఎస్పి బి. కృష్ణారావు పరిశీలించారు. ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు నిర్వహించే గ్రూప్-2 రాత పరీక్ష సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి స్థానిక శ్రీసాయి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల, రాజు హైస్కూల్ , శ్రీ దేవపట్ల హరినాథరెడ్డి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్షల తీరును పరిశీలించారు .పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తును సమీక్షించారు.

పీలేరు : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 400 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యేలా ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రాన్ని సన్నద్ధం చేసేలా కళాశాల ప్రిన్సిపల్ కు ఆదేశాలు జారీ చేసింది. తధానుసారం ప్రిన్సిపాల్ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను సమకూర్చారు. పరీక్షకు హాజరు కావాల్సిన 400 మందిలో 315 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. మరో 85 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, చీఫ్ ఇన్విజిలేటర్ మజీద్ అహ్మద్ తెలిపారు. పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ముందుగా అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, సిఐ మోహన్ రెడ్డి పరీక్ష నిర్వహణా నిబంధనలు వివరించారు. పరీక్షా కేంద్రం వెలుపలే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఈ సందర్భంగా సిఐ మోహన్ రెడ్డి సూచనల మేరకు ఎస్సై నరసింహుడు, అదనపు ఎస్సై రమణయ్య తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డిఐఒ ఎం.కృష్ణయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

మార్చి 1 నుంచి నిర్వహించబోయే ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా మంచి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు కూడా చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారి ఎం. కృష్ణయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మార్చి 1 నుంచి నిర్వహించడోయే ఇంటర్ పరీక్షల నిర్వహణ, అందుకు తగ్గ ఏర్పాట్లు, విద్యార్థులకు సూచనలను ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

జిల్లాలో జూనియర్ కళాశాలలు ఎన్ని ఉన్నాయి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 150 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలున్నాయి.ఇందులో ప్రభుత్వ 24, ఎయిటెడ్ 1, ఎపి ఆర్‌జెసి2, మోడల్ స్కూల్ 17, కేజిబివి 22, ఒకేషనల్ 11, సోషల్ వెల్ఫేర్ 10, హై స్కూల్ 4, ఎంజెఆర్ ఎంపి 1, ప్రయివేట్ 57 జూనియర్ కళాశాలలున్నాయి.

పరీక్షల షెడ్యూల్స్ వివరిస్తారా?

పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి.1,2 తేదీల్లో మొదటి, ద్వితయ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాష పరీక్ష, 4,5 తేదీలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అంగ్ల బాషా పరీక్ష, 6,7 వ తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత శాస్త్రం -1 ఎ,2 ఎ, వృక్ష శాస్త్రం 1,2, పౌరశాస్త్రం 1,2, 9,11 తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత శాస్త్రం 1 బి, 2 బి, జంతు శాస్త్రం 1,2, చరిత్ర 1,2, 12,13వ తేదీల్లో భౌతిక శాస్త్రం 1,2 అర్థశాస్త్రం 1,2, 14,15 తేది లలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రసాయన శాస్త్రం 1,2 , వాణిజ్య శాస్త్రం 1,2 , సమాజ శాస్త్రం 1,2 , లలిత కళలు- సంగీతం 1,2, 16,18 వ తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వ పాలన శాస్త్రం 1,2, తర్క శాస్త్రం 1,2, బ్రిడ్జ్ కోర్స్ - గణిత శాస్త్రం (బి. పి.సి విద్యార్థుల కొరకు),19,20 తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆధునిక భాషా 1,2 , భౌగోళిక శాస్త్రం 1,2 జరుగుతాయి.

ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

జిల్లావ్యాప్తంగా 26,634 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఇందులో మొదటి సంవత్సరం 14, 731, ద్వితీయ సంవత్సరం 11,903 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. మొదటి సంవత్సరంలో బాలురు 7,196, బాలికలు 7,535, ద్వితీయ సంవత్సరంలో బాలురు 5,871,బాలికలు 6,032 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.

పరీక్ష కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.26 ప్రయివేట్ కళాశాలలు,28 ప్రభుత్వ కళాశాల్లో ఏర్పాటు చేశాం.

పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని కేటాయించారు?

చీప్ సూపర్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 54, అడిషనల్ స్టాఫ్ సూపరింటెండెంట్ 26, ఫ్లేయింగ్ స్క్వాడ్ ముగ్గురును కేటాయించాం.

విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఎలా కల్పిస్తున్నారు?

ఇటీవల కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అన్ని శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నాం. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది.

పరిక్ష కేంద్రాల వద్ద ఎంటు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. అలాగే తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నాం. సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులు సిసి కెమెరా ఫుటేజ్ లో పర్యవేక్షిస్తారు.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

విద్యార్థులు అటెండెన్స్ తక్కువైనా కూడా కండెనేషన్ ఫీజు కట్టాల్సిన అవసరం లేదు. ప్రయివేట్ కళాశాలలో హాల్ టికెట్లు ఇవ్వకుండా ఎవరైనా ఇబ్బంది పెడితే ఇంటర్‌నెట్‌లో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. సెంటర్లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రయత్నం చేయాలి.

మాట్లాడుతున్న సిఐ మోహన్‌రెడ్డి

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి-పీలేరు

బ్యాట్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని పీలేరు సిఐ మోహన్ రెడ్డి తెలిపారు. పీలేరు ఫ్రెండ్స్ బ్యాట్మింటన్ టీం తరపున ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ వి. రామ్మోహన్ రెడ్డి ఆదివారం పురుషుల బ్యాట్మింటన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డు, రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని వియస్ఎన్ స్మార్ట్ కిడ్స్ స్కూల్ ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు నుంచి హాజరైన 40 బ్యాట్మింటన్ జట్ల మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోటీల్లో గెలుపు, ఓటములు అనేవి సహజమని అన్నారు. ప్రతి అపజయం వెనుక మరో విజయం ఉంటుందన్న వాస్తవాన్ని ప్రతి క్రీడాకారుడూ గుర్తుంచుకుని స్నేహపూర్వక వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్స్‌లో మదనపల్లి - రాయచోటి, పీలేరు - సుండుపల్లి జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. ఫైనల్స్ అనంతరం నాలుగు విభాగాల్లో విజేతలను ఎంపిక చేసి, ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.7,000, తృతీయ బహుమతి రూ.5,000, చతుర్థ బహుమతి రూ.3,000 లు నగదుతో పాటు ట్రోపీలను బహుకరించనున్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, ఇతర సీనియర్ క్రీడాకారులతో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

యోగా సాధనపై శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

ఆరోగ్యానికి యోగా అవసరం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు షీ దివ్య యోగ విద్యాలయం ఆధ్వర్యంలో ఆరోగ్య సమస్యల పరిష్కారానికై సులభతర కుండలిని యోగా (ఎస్.కె.వై) తరగతులు ఆదివారం ప్రారంభించినట్లు నిర్వాహకులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి తెలిపారు. మూడు ఆదివారాల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులలో వివిధ శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగ పద్ధతులతో పాటు తగిన ఆరోగ్య సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈనెల 25తో పాటు మార్చి 3, 10వ తేదీల్లో ఈ కుండలిని యోగా విద్యను తిరుపతి స్కై యోగా ట్రస్టు అధ్యక్షులు మునిరత్నం రెడ్డి, వారి బృందం నేర్పుతారన్నారు. కార్యక్రమంలో 18 మంది పాల్గొని కుండలిని యోగ పై అవగాహన పెంచుకున్నారు. అనంతరం కాయకల్ప యోగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ లీగల్ అడ్వైజర్ రాయల సుధాకర్ రాయలు, ఎంపిటిసి కంభం నరసింహారెడ్డి, రమాదేవి, వియస్ఎన్ సిద్ధార్థ శోభారాణి, కావ్య, కుమారి, భాగ్యలక్ష్మి, ఆకుల భాస్కర్ మాస్టర్ పాల్గొన్నారు.

ఎపి జెఎసి నిర్ణయం సరికాదు : యుటిఎఫ్

కడప అర్బన్ : లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకనుగుణంగా నిలబడి పోరాటం చేయాల్సిన ఏపి జెఏసి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27న 'చలో విజయవాడ' పిలుపును వాయిదా వేయడం సరైనది కాదని, జెఎసి నిర్ణయాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి పోలీసులు అడ్డగిస్తారని మూడు రోజులు ముందే విజయవాడ చేరుకున్నట్లు తెలిపారు. వాయిదా కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయిల ఆకాంక్షలను నీరుగార్చే విధంగా ఉందని పేర్కొన్నారు. పిఎఫ్, ఏపిజిఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు రూ.20వేల కోట్లపై ప్రభుత్వం ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా మినిట్స్ జారీ చేశారన్నారు. 11వ పిఆర్‌సి బకాయిల చెల్లింపుపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ పోరాటాన్ని కొనసాగించాలని కోరారు.

ఘోర రోడ్డు ప్రమాదం

◆ లారీని ఢీకొన్న స్కార్పియో వాహనం

◆ ఐదుగురు దుర్మరణం

◆ మృతుల్లో ఇద్దరు రైతులు

అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. వివరాలు..

మృతిచెందిన రైతులు చంద్ర, సుబ్రహ్మణ్యం

దుర్మరణం చెందిన యువకులు

ప్రజాశక్తి- మదనపల్లె (అన్నమయ్య జిల్లా)

మదనపల్లె రామారావు కాలనీకి చెందిన ఆరుగురు స్కార్పియో వాహనంలో బెంగుళూరుకు వారి సొంత పనిపై వెళ్లారు. పని ముగించుకుని ఆదివారం బెంగుళూరు నుంచి మదనపల్లెకు తిరుగు పయనమయ్యారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో మండలంలోని బార్లపల్లె వద్దకు రాగానే అప్పుడే పాలు పోయడానికి బైక్‌పై వెళ్తున్న కోళ్లవారిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు చంద్ర (50), సుబ్రహ్మణ్యం (62) ను కారు ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు తిలక్, విక్రమ్, శ్రీను కూడా అక్కడికక్కడే దుర్మణం చెందారు. కారులో ఉన్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వారందరూ మదనపల్లి పట్టణం, రూరల్ మండలానికి చెందిన వారు కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని బార్లపల్లె వాసులు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మదనపల్లె నియోజకవర్గ వైసిపి కన్వీనర్ నిస్సార్ అహ్మద్ పరామర్శించారు.

జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాష్ట్ర శ్రేయస్సు కోసమే పొత్తు

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు కోరే జనసేన అధినేత టిడిపితో పొత్తు పెట్టుకున్నారని, ఆయన తీసుకునే నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి జనసైనికుడూ కలిసి నడవాలని జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గం బాధ్యులు బెజవాడ దినేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పొత్తులో భాగంగా పీలేరు జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా అధిష్టానం నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ప్రకటించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన కలికిరి నగరిపల్లికి జనసేన సైనికులతో కలసి వెళ్లి మొదటి విడత లోనే పీలేరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికైన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని తన స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గెలుపునకు పీలేరు నియోజకవర్గంలోని ప్రతి జనసైనికుడూ అంకిత భావంతో కట్టుబడి పని చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో కలికిరి మండల జనసేన అధ్యక్షులు అస్లాం, ఉపాధ్యక్షులు జబీర్, రవి, ప్రధాన కార్యదర్శి షావలి, ఇమ్రాన్, సీనియర్ నాయకులు రెడ్డెప్ప, కెవి పల్లి మండల అధ్యక్షులు మహేష్, వాల్మీకిపురం మండల ఉపాధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కిషోర్, తేజ, లోకేష్, ఎల్లప్ప పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

16 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి -రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరంలో 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. సందర్భంగా నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, యర్రావారి పాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ,పెద్దమండెం, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ట్రాప్‌లో పడొద్దు

ప్రజాశక్తి - మదనపల్లి

వైసిపి నాయకుల ట్రాప్‌లో జనసైనికులు పడొద్దని, రాబోయేది జనసేన, టిడిపి ప్రభుత్వమేనని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ఉమ్మడి తొలి జాబితాను ప్రకటించిన నేపథ్యంలో వైసిపి నాయకులు రోజా, నాని, అంబటి రాంబాబు లాంటి వాళ్ల జనసేన పైన ఎనలేని ప్రేమ ఒలకబోయడం హేయనీయమన్నారు. జనసేన, టిడిపికి కుమ్ములాట్లు పెట్టి ఆ సందులో వైసిపి గెలవాలని చూస్తుందని, ఈ కుయుక్తులను జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఎన్ని సీట్లు పోటీ చేయాలనేది, పార్టీ వ్యూహం ఏంటి అనేది అధినేత చూసుకుంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ, , జనసేన పార్టీ నాయకులు ప్రవీణ్, అబ్జర్వర్ గోపి దేవేందర్, పవన్, సుబ్బయ్య, జనసేన పార్టీ మహిళ నాయకురాలు సునీత, నగీన పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పలవలి రామకృష్ణారెడ్డి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

రైతులు, కార్మికులు కోసం వెన్నుదన్నుగా నిల్చుని ఉద్యమాలకు ఒరవడి దిద్దిన పలవలి రామకృష్ణారెడ్డి మంచి కమ్యూనిస్టు అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. పలవలి రామకృష్ణారెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా సిపిఎం మదనపల్లె ఆధ్వర్యంలో వర్ధంతిసభ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఇండియా, చైనా యుద్ధంలో అరెస్టయి జైలుకు వెళ్లడమే కాకుండా న్యాయవాద వృత్తి ద్వారా పేదలకు సేవల ందించిన ఆదర్శ కమ్యూనిస్టు అన్నారు. నిరుపేద కుటుంబంలో రామకృష్ణారెడ్డి పుట్టి బాగా చదువుకుని ఎందరో పేదలకు న్యాయవాదిగా పైసా ఫీజు తీసుకోకుండా సేవలందించారని కొనియాడారు. భూస్వామి కుటుంబంతో సంబంధం కలుపుకున్నా, గొప్పగా బతికేందుకు అవకాశాలున్నా సిపిఎం బాటను మాత్రం వీడలేదన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, కష్టజీవులను ఐక్యం చేసి సమసమాజ స్థాపనకు కృషి చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ ఆశయ సాధనకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు హరిశర్మ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన రామకృష్ణారెడ్డి, న్యాయవాద వృత్తిలో ఎంతోమంది పేదలకు న్యాయం జరిగేలా చూశార న్నారు. మూఢ నమ్మకాలను పారదోలడానికి కృషి చేశారన్నారు. తొలుత పలవలి రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగరాజు, రఘునాథ్ పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షాజహాన్‌బాషా

టిడిపిలో 150 కుటుంబాలు చేరికలు

ప్రజాశక్తి-మదనపల్లి

ఉమ్మడి చిత్తూరు జిల్లా, మదనపల్లిలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాష సమక్షంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో 150 మందికి పైగా టిడిపిలో చేరారు. అభ్యర్థుల ఖరారు, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో వైసిపిలోని వ్యతిరేక వర్గ నేతలు, అనుచరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన అందరికీ షాజహాన్‌బాషా తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ టిడిపి అండగా ఉండటమే కాకుండా అధినేత చంద్రబాబుతో చర్చించి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. టిడిపిలో చేరిన పట్టణంలోని మహిళలను, అభిమానులను, కార్యకర్తలను, అధికారులు, అనధికారులు , వైసిపి నాయకులు బెదిరింపులకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు

జనసేన నాయకులతో దినేష్

'నల్లారి' గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి-కలికిరి

నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పీలేరు జనసేన అధ్యక్షులు దినేష్ అన్నారు. ఆదివారం కలికిరిలో జనసేన నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత తీసుకునే ప్రతినిర్ణయం ఈ రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయంగా ప్రతి జనసైనికులు గుర్తుంచుకొని ఆయన నిర్ణయానికి కట్టు కూడా ఉండాలని ఆదేశించారు. పొత్తులో భాగంగా పీలేరు జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా అధిష్ఠానం నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డిని ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రంలో కలికిరి మండల ప్రెసిడెం ట్ అస్లాం, ఉపాధ్యక్షులు జబీర్, రవి. ప్రధాన కార్యదర్శి షవల్లి, ఇమ్రాన్, సీనియర్ నాయకులు రెడ్డెప్ప, కేవీ పల్లి మండల అధ్యక్షుడు మహేష్, వాయల్పాడు మండల ఉపాధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కిషోర్ పాల్గొన్నారు.

షబ్-ఎ-బరాత్ ప్రాముఖ్యమైంది

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మహమ్మద్‌ఖాన్

షబ్-ఎ-బరాత్ ముస్లిములకు ప్రత్యేకమైనదని అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. మనం ఉద్దేశపూర్వకంగా లేదా తెలియకుండా చేసిన ఉమ్మా అన్ని పాపాలను క్షమించడానికి అల్లాహ్ చాలా పరివేష్టితుడై ఉంటారనేది ప్రగాఢ నమ్మకమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరి సోదరులంతా రెండు రోజుల ఉపవాస దీక్షలు చేయ డంతోపాటు రాత్రంతా జాగారం చేసి ప్రత్యేకంగా నమాజులు, ఖురాన్ చదువు తారని తెలి పారు. షబ్-ఎ-బరాత్ పర్వదినం పురస్కరించుకొని ముస్లిము సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

18 మంది బైండోవర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలో పేకాట,అక్రమ మద్యం రవాణా,విక్రయాల కేసుల్లో నిందితులను బైండోవర్ చేసినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట పోలీస్ స్టేషను పరిధిలో నమోదైన పాత కేసులలో ఉన్న కర్ణాటక మద్యం రవాణా, నాటుసారా విక్రయాలు, పేకాటలో నిందితులుగా 18 మందిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిఘా మరింత కట్టుదిట్టం చేశామని తెలిపారు.

ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టిడిపి అధ్యక్షులు చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి మహిళా నాయకులు నగిరిపాటి రేవతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పొందులూరు గ్రామపంచాయతీ చక్రంపేట, నాయుడు వారిపల్లి, తూర్పుపల్లి, గోవిందంపల్లి, ఈటిమాపురం గ్రామ పంచాయతీలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జిలు, నాగినేని రాంప్రసాద్ నాయుడు,షేక్ షామీర్‌బాషా, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, కోలామురళి, ఎర్రతోటి సురేష్, శ్రీరామ్, పుచ్చకాయలు సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, మహేంద్ర, లక్ష్మీ నరసయ్య, రాజంపేట పార్లమెంట్ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు తేనెపల్లి చిన్న, విశ్రాంతి తహశీల్దార్ నగిరిపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎంపీ రఘునాథరెడ్డిని సన్మానిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ఎంపీ రఘునాథరెడ్డిని కలిసిన 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఇటీవల వైసిపి రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన మేడా రఘునాథరెడ్డిని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మధ్యాహ్నం వారి కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నందలూరు వైస్ ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మారె సుకుమార్ పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా తిరుమలేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం టిఎన్ఎస్ఎఫ్ కడప జిల్లా అధ్యక్షులుగా బొజ్జ తిరుమలేష్‌ను నియమిస్తూ పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం కడప పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గొరిగనూరు సుధీర్ రెడ్డిని తొలగించారు.

మాధవిరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-కడప

కడప అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పేరు ఖరారైన రెడ్డప్ప గారి మాధవి రెడ్డిని ఆదివారం నివాసంలో తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మడక చక్రధర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షేక్ అమీర్‌బాషా పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని సచివాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల నాయకుడు సగిలి గురయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు ఏడాది పాటు వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో కొన్ని కుటుంబాలు కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధించడం సరికాదన్నారు. ఈవిషయంపై ఇఒపిఆర్‌డి మురారిని ప్రశ్నించగా ఎస్ డబ్ల్యూ పిసి కార్మికులు ఎక్కడా పనిచేయడం లేదని, ఇప్పటి నుంచైనా సచివాలయాలకు వెళ్లి పని చేస్తే కొన్ని నెలల వేతనాలు మంజూరయ్యేలా చూస్తామని సమాధానమించ్చారు. కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ పిసి వర్కర్లు పాల్గొన్నారు..

జయచంద్రారెడ్డికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ టికెట్ దాసిరిపల్లి జయచంద్రారెడ్డికి దక్కడంతో రెండు రోజులుగా మొలకలచెరువులోని ఆయన స్వగృహం వేలాదిమంది జన సందోహంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టిడిపి మాజీ ప్రజా ప్రతినిధులు, మండల అధ్యక్షులు, క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయచంద్ర రెడ్డికి అభినందనలు తెలిపారు. గత ఐదేళ్లుగా వైసిపి నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమ కేసులకు ఎక్కువ అయ్యాయని, అండగా నిలిచేందుకు జయచంద్రారెడ్డి వచ్చారని అన్నారు. ఈ సందర్భంగా జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజ కవర్గంలో భవిష్యత్తులో అరాచక, దౌర్జన్యాల, దోపిడీ పాలనకు చమర గీతం పాడుతామని రాబోయే టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది స్వేచ్ఛగా జీవించే రామరాజ్యం వస్తుందని భరోసా ఇచ్చారు. తనను అభినందించడానికి వేలాదిగా

మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

తరలివచ్చిన పసుపు దండును కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరిస్తున్నానని ప్రతి ఒక్కరూ ప్రజా సుపరి పాలన కోసం తనతో కలిసి రావాలని, అండగా ఉంటానని భరోసానిచ్చారు.

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన జగన్ : 'కస్తూరి'

విశ్వనాథనాయుడు, కెకె చౌదరిలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చిట్వేలి

రాష్ట్రానికి పట్టిన వైసిపి గ్రహణం వదలాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాజగుంట, చింతల చిలుకలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని జనసేన నాయకులతో కలిసి మండల అధ్యక్షుడు కెకె చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కస్తూరి ఇంటింటికి టిడిపి టిడిపి మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రజలు జగన్మోహన్ రెడ్డి నట్టేట ముంచారని అన్నారు. వైసిపి ప్రజలు చేస్తున్న అరాచక పాలననుప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో మూల్యం తప్పదు అన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధి.కారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట వస్తారని చెప్పారు. ఆర్‌టిసి బస్సులలో ఉచితప్రయాణం, సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, 18 సంవత్సరాల నిండి మహిళలకు నెలకు రూ.1500 అందిస్తారని చెప్పారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలకు ఇంటిలో ఎంత మంది ఉంటే అంతమందికి సంవ త్సరానికి రూ.15 వేలు అందివ్వనున్నారని అన్నారు. నిరుద్యోగులకు యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు నిరుద్యోభృతి అందివ్వడంతో పాటు 20లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. సంక్షేమ పాలన కోసం టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశ్రామి కవేత్త విశ్వేశ్వర్ నాయుడు, పూలల రమేష్, రాజశేఖర్, లాయర్ బాలాజీ, మహిళ నేతలు అనిత దీప్తి, రేవతి, బాలకృష్ణ, గుండయ్య, శ్రీధర్, అనంతయ్య యాదవ్, జనసేన నాయకులు మాదాసు నరసింహ, వెంకటేష్ రాజు, సుబ్రహ్మణ్యం యాదవ్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో అందరూ కలిసికట్టుగా ఉంటే ముందుకు వెళ్లేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. నగర శాఖ పటిష్టమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నగరశాఖ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా పల్లా నరసింహారావు, కోశాధికారిగా టేకూరి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా పల్లా మురళీకృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా డాక్టర్ బండారు శ్రీనివాసులు, సంగినాథం కొండయ్య, గంజికుంట రఘురామయ్య, పోలిశెట్టి రెడ్డెయ్య, పుజల శంకర్, చౌడం లక్ష్మినారాయణ, దండే నాగభూషణం, బొల్లు సోమశేఖర్, గౌరవాధ్యక్షులుగా సుంకర రామచంద్రుడు, డాక్టర్ పల్లా భాస్కర్, డాక్టర్ చౌడం వెంకటేష్, సంగినాథం ఆంజనేయులు, కందికండి రమేష్‌బాబు, డాక్టర్ గంజికుంట తిరుమలరావు, గాలి పుల్లయ్య, గోవిందు నాగరాజు, ఇట్టే వేణుగోపాల్, పల్లా బాల చౌడన్నను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చౌడం సూర్యనారాయణ, సానా పరమేశ్వర్, పోలిశెట్టి రఘురామయ్య, వెలిగండ్ల సుబ్బరాయుడు, ఇడెం చిన్న సుబ్బరాయుడు, బొమ్మిశెట్టి శ్రీరాములు, పూజల శ్రీనివాసులు, అంబటి నాగయ్య, బండి కృష్ణయ్య, బూశెట్టి మల్లికార్జున, గొర్రకూటి వెంకటసుబ్బన్న, దొడ్ల వెంకటరమణ, గుండ్లపల్లి ఆంజనేయులు, గోవిందు వెంకటరమణ, మోతుకూరు పుల్లయ్య, బొలిశెట్టి వెంకటస్వామి,

ఏకగ్రీవంగా ఎన్నికైన నాయకులు

సహాయ కార్యదర్శులుగా మోతుకూరి సుబ్బరాయుడు, సిఆర్‌ఐ సునీల్ జయంత్, ఉమ్మడిశెట్టి వెంకటసురేంద్ర, దండే వెంకటసుబ్బయ్య, పల్లా వెంకటసుబ్బయ్య, బడిగించల రంగనాయకులు, సుంకర శివశంకర్, సహాయ కార్యదర్శులు గోవిందు ఎద్దుల కొండ్రాయుడు, పబ్బులేటి వెంకటరమణ, వెలిగండ్ల సుబ్బయ్య, కాల్వ వాగేష్, ఇడెం సురేంద్ర, పూలజ మురళికృష్ణ, పట్టుపోగుల సుబ్బారావు, బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, కొర్రకూటి గోవిందరాజులు, పల్లా రఘ, కంచెన గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బండారు శ్రీనివాసులు, పబ్బులేటి శ్రీనివాసులు, సుంకర నారాయణ స్వామి, ఎల్లయ్య, జగన్, టేకూరి పుష్పాంగదా, ప్రభాకర్, రవికుమార్, వీరన రసింహులు, కార్యవర్గ సభ్యులు ఇ.రవికుమార్, పి.భరణితేజ, శివశంకర్, బలరాంను ఎన్నుకున్నారు.

సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

గెలుపొందిన విజేతలతో సైన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సి.వి.రామన్ సైన్స్ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టు స్థానిక గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు డివిజన్ ఉప విద్యా శాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రాణం పోయాలన్నారు. అప్పుడే వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీస్తుందని తెలిపారు. సివి రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ కె.వి.విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో సైన్స్ విద్యకు విశేషమైన ప్రాధాన్యం ఒనగూరనుందన్నారు. చీకటి నుంచి వెలుగును ప్రసరింపజేయడానికి శాస్త్రజ్ఞులు సరికొత్త బాటలు వేయా లని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధత, నిజాయితీలతో మెలగాలని కోరా రు. తమకున్న సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్యను అందించడమే ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి కంభం చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతన వైజ్ఞానిక ఆవిష్కరణలతో మానవుడి జీవన పయనం సుఖమయంగా మారిందన్నారు. ఎంఇఒ బి.సావిత్రమ్మ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020లో పొందుపరిచిన విధంగా విద్యా బోధన, పరిశోధనలు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాల నుండి 200 విద్యార్థులు 75 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సి.వి.రామన్ ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, క్లబ్ గౌరవ అధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి, రవి ప్రకాష్, మహేశ్వర్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్,గోవర్ధన్ పాల్గొన్నారు. మెమెంటోలు కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి, పరీక్ష ప్యాడ్స్ ఒంటెరు శ్రీనివాసులరెడ్డి, పెన్నులు కె.వాణి, కన్సోలేషన్ బహుమతులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శేషశర్మ, తెలుగు మాధ్యమ ప్రథమ బహుమతులు శ్రీ రమణ మహర్షి పాఠశాల పూర్వ విద్యార్థులు అందజేశారు.

నాడీ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

నాడీ సంబంధిత వ్యాధులపై గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాలలో మరింత అవగాహన కల్పించేలా ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ సంస్థ కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూరో వైద్యుల సంఘం (ఏపి ఎన్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి విజయ సూచించారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లో వైయస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజిషియన్లు సమావేశయ్యారు. ట్విన్ డిస్ట్రిక్ న్యూరో క్లబ్ క్లబ్‌ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విజయ మాట్లాడుతూ సమాజంలోని ప్రజానీకానికి నరాల వ్యాధుల గురించి మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మారుతున్న కాలానుగుణంగా, మానవుని జీవనశైలిలో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. కార్లలో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్, అలాగే ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం ఎపి న్యూరో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వైసిపి కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో వైద్యులంతా ఈ సంస్థ ద్వారా సంఘటితంగా ఉండాలని ఉద్బోధించారు. సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు అవ్వారు

న్యూరో క్లబ్ ను ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విజయ్

అర్జున్ కుమార్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు నాడీ సంబంధిత వ్యాధుల పట్ల మరింత చైతన్య పెంపొందించేలా సంఘం ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ట్విన్ డిస్ట్రిక్ న్యూరో క్లబ్ కు ఐఎంఎ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైద్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై వైద్యులు చర్చించారు. కార్యక్రమంలో ట్విన్ డిస్టిక్ న్యూరో క్లబ్ అధ్యక్షులు డాక్టర్. కమ్మినేని ఆంజనేయులు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ డి.జగదీశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.జయచంద్రా రెడ్డి, న్యూరో వైద్యులు డా. క్రాంతి కుమార్, డా. జి.గణేష్, డా. కె.జగదీష్ బాబు, డా.నవీన్ ప్రసాద్, డా.జె. మోహన్ సిద్ధార్థ్, డా. సాయికిరణ్ పాల్గొన్నారు.

సాహితీ బ్రహ్మర్షి 'భూతపురి' : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవితా రచనను ఒక తపస్సులా భావించి అనేక మాహాకావ్యాలను రచించిన సాహితీ బ్రహ్మర్షి డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో భూతపురి 87వ జయంతి, 22వ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భూతపురి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పురస్కారాన్ని ఎస్వీయూ గౌరవ డాక్టరేట్, గండపెండేర, గజారోహణాది గొప్ప సత్కారాలు అందుకున్న వైద్యం వేంకటేశ్వ రాచర్యులుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విసి సుధాకర్ మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సాహితీ కృషి విశిష్టమైందని పేర్కొన్నారు. కవీశ్వరులలతో భూతపురి ఒకరన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భూతపురి వ్యాఖ్యాన రచనలో దిట్ట అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ భూతపురి వ్యక్తిత్వం చాలాగొప్పదన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన సాహితీవేత్త, తెలుగు పండితులు బి.రాజశేఖర్ మాట్లాడుతూ వైద్యం వేంకటేశ్వరాచార్యుల సాహిత్య కృషి విస్తృతమైందని పేర్కొన్నారు. ముద్రించిన గ్రంథాలు 78 కాగా, అముద్రిత గ్రంథాలు, వ్యాసాలు చాలా ఉన్నాయని తెలిపారు. వైద్య వేంకటేశ్వరాచార్యులకు అతిథులతో కలిసి భూతపురి కుమారులు డాక్టర్ శివరామసురేంద్రశర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రి రూ.10,116 నగదు, జ్ఞాపిక, తలపాగా, శాలువా, సన్మానపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ఆత్మీయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని హెచ్ఎంఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు డిజిటల్ కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరవింద కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ స్వరూపారాణి ,రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ శివతేజ రెడ్డి, ఫ్యాకో కార్డియా రిఫ్రాక్టివ్ సర్జన్ డాక్టర్ హరికరెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వై.దామోదర్‌రెడ్డిల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, అందులో 900 మందికి షుగర్ పరీక్షలు ఎస్వి డయాగ్నటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించామని, దాదాపు 180 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉండగా అందులో 80 మందిని ఆపరేషన్ కోసం కడప భారతి హాస్పిటల్‌కు తరలించామని తెలిపారు. మరో 100 మందికి షుగర్ ఉండడం వలన వారికి షుగర్ తగ్గిన అనంతరం ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. దాదాపు 70 వేల రూపాయల మందులు కూడా పంపిణీ చేశామని, వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఉచిత భజన వసతి కూడా కల్పించామని డాక్టర్ అహ్మద్ తెలిపారు.

హెచ్ఐవిపై నటరాజ కళాజాత బృందం

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కృషి సంస్థ సహకారంతో నటరాజ కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం పట్టణంలో జ్యోతి బస్టాండ్ సర్కిల్‌లో వీధినాటకం ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకో వాలనే అంశాలపై నాటకం ద్వారా వివరించారు. ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగంపై తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, ఎల్.టి.లక్ష్మీకాంత్, ఐసిటిసి కౌన్సెలర్ ఆనంద్, కృషి సంస్థ పియు ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, ఒఆర్‌డబ్ల్యూ భారతి, పిఇలు మంజుల, ఉమాదేవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న పఠాన్ ఖాదర్‌ఖాన్

టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని పీలేరు నియోజకవర్గం టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించడం పట్ల టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు, మాజీ సర్పంచ్, తాజ్ హోటల్స్ అధినేత పఠాన్‌ఖాదర్‌ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కిషోర్‌కుమార్‌రెడ్డి స్వగృహనికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో టిడిపి, జనసేన గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

బస్సులో విజయవాడకు బయలుదేరుతున్న శంకర్ యాదవ్ అభిమానులు

శంకర్ యాదవ్‌కే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

తంతంబళ్లపల్లి టిడిపి ఎమ్మెల్యే టికెట్ మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కే కేటాయించాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జయచంద్రారెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం శంకర్‌యాదవ్ అభిమానులు రెండు బస్సులలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన శంకర్‌యాదవ్‌కే టికెట్ కేటాయించాలని చంద్రబాబును కోరుతామని అన్నారు. పార్టీ పటిష్టతకు, పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి శంకర్ యాదవ్‌ను పోటీలో ఉంచితే పార్టీ విజయానికి శాయశక్తుల కృషి చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ తిరుపాల్‌రెడ్డికి ఇవ్వాలి

పులివెందుల టౌన్ : పులివెందుల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్‌ను ఆ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డికిస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ నాయకులు రమేష్, శివబ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ తిరుపాల్‌రెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. అందరిని కలుపుకొనిపోయే మనస్తత్వం కూడా తిరుపాల్‌కు ఉందన్నారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి పులివెందుల ప్రాంతంలో ఎంతో మందిని పార్టీలో చేర్పించి అధిష్టానం వద్ద మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. పులివెందుల ప్రాంత ప్రజలు కూడా తిరుపాల్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆశిస్తున్నారన్నారు. తిరుపాల్‌రెడ్డికి టికెట్టు కేటాయిస్తే తాము కూడా పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి, మాజీ రాజ్యసభలు తులసిరెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ గుండ్లకుంట శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్ తదితర నాయకుల ఆశీస్సులు కూడా తిరుపాల్ రెడ్డికి మెండుగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పులివెందుల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తిరు పాల్‌రెడ్డికే టికెట్ కేటాయించాలని తాము అధిష్టానాన్ని కోరుతున్నామన్నారు.

వైసిపిని ఆదరించండి

చక్రాయపేట : వైసిపిని ఆదరించాలని మండలంలోని గంగారపువాండ్లపల్లి గ్రామం పరిధిలో ఆదివారం ఆ పార్టీ నాయకులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గొట్లమీట్ల, ఎద్దులవాండ్లపల్లిలో ప్రతి గడపకు వెళ్లారు. కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి వై.ఎస్.కొండారెడ్డి, సర్పంచ్ నాగేశ్వరమ్మ, పార్టీ కార్యకర్త శంకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.